క్లుప్తంగా

హైదరాబాద్‌కు నూతన బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: మదనపల్లె–1 డిపో నుంచి హైదరాబాద్‌కు ఈనెల 29 నుంచి అశోక్‌లైలాండ్ బీఎస్–6 బస్సును ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి ప్రతి రోజు రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఎంజీబీఎస్‌కు ఉదయం 6.30 గంటలకు, జీడిమెట్లకు 7.30 గంటలకు చేరుకుంటుందన్నారు. అలాగే తిరుగు ప్రయాణం నందు జీడిమెట్ల నుంచి సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లైబ్రరీకి మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్ వితరణ చేస్తున్న దాతలు

మదనపల్లె సిటీ: స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంకు పట్టణానికి చెందిన శ్రీనివాసులు,పూర్ణిమ మైక్‌సెట్ ఉచితంగా అందజేశారు. బుధవారం శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రంథాలయ అధికారి వసంతకుమారికి అందించారు. వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనడంతో మైక్‌సెట్ లేకపోవడంతో గుర్తించి అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాలకృష్ణ, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో అన్నదానం



అన్నదానం చేస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని మార్కెట్‌యార్డులో బుధవారం హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. విజయభాస్కర్‌నాయుడు పుట్టినరోజు పురస్కరించుకుని అన్నదానం చేసినట్లు హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సాదిక్, సాంబ, రోజా, సెల్వమణి, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజంపేట రూరల్ : బ్రహ్మణపల్లి సబ్ స్టేషన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ తెలియజేశారు. స్థానిక డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజంపేట మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి సబ్ స్టేషన్ 220 కెవిఎస్ఎస్ పరిధిలో గురువారం విద్యుత్ లైన్ల నవీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలియజేశారు. రాజంపేట పట్టణంతో పాటు మండలంలోని తాళ్లపాక, ఆకేపాడు, కట్టకిందపల్లి, ఎస్ఆర్ పాళెం, హెచ్ చెర్లోపల్లి సబ్ స్టేషన్‌ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలియజేశారు.

నివాళి

రామాపురం : మండలంలోని రాచపల్లి గ్రామం మాజీ సర్పంచ్ గాలివీటి వీరారెడ్డి దశదిన కర్మకాండ కార్యక్రమానికి బుధవారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి హాజరై వీరారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తకోడూరు జాతర

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరులో వెలసివున్న గంగమ్మకు బుధవారం ఘనంగా జాతర నిర్వహించారు. వేకువజామున గంగమ్మ మిట్ట నుంచి గంగమ్మను ఊరేగింపుగా తీసుకుని వచ్చి ఆలయం వద్ద ప్రతిష్టించారు. అనంతరం భక్తులు పెద్దఎత్తున మొక్కుబడులు తీర్చుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే నిర్వాహకులు భక్తులకు అన్నదానాలు, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

'అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రజలు ఇచ్చిన విజయాన్ని మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సద్వినియోగం చేసుకొని ప్రజలకు గొప్పగా సేవ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గాజుల భాస్కర్ కోరారు. మొదటి సారిగా గెలవడంతోపాటు మంత్రి పదవి దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. రాయచోటి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని సూచించారు. రాయచోటి ప్రాంతం బాగా వెనుకబాటుకు గురైన ప్రాంతమన్నారు. ఇప్పటికైనా చొరవ చూపి ప్రాంతం అభివృద్ధిపై శ్రద్ధ చూపాలని తెలియజేశారు.

బడి.. నేటి నుంచి సందడి

- మోగనున్న బడిగంటలు
- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం



ప్రత్యేకంగా వెలసిన యూనిఫామ్ షాపు



బ్యాగులు, షూష్ కొనుగోలు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



పునః ప్రారంభానికి సిద్ధమైన చీకలబైలు ప్రాథమిక పాఠశాల



మదనపల్లెలో పుస్తకాల షాపులో సందడి

మదనపల్లె సిటీ: జిల్లాలో గురువారం నుంచి బడి గంటలు మోగనున్నాయి. సెలవుల్లో ఆటపాటలెచ అమ్మానాన్నలు, ఇతర కుటుంబ సభ్యులు, స్నేహితులు, సెల్‌ఫోన్లు, టీవీలతో హాయిగా గడిపిన పిల్లలు ఇప్పుడవన్నీ వదిలిపెట్టి పాఠశాలలకు వెళ్లాలంటేనే గుబులు. ఈ నేపథ్యంలో పిల్లలను పాఠశాలలకు సన్నద్ధం చేయాలంటే తల్లిదండ్రులకు తలకు మించిన భారమే. తల్లిదండ్రులు కాసింత శ్రద్ధ పెడితే మారాం చేయకుండా పిల్లలు ఎంచక్కగా పాఠశాలలకు వెళ్తారని నిపుణులు చెబుతున్నారు.

సెలవులకు టాటా..

వేసవి సెలవులంతా ఆటపాటలతో గడిపిన చిన్నారులు ఇక వాటికి స్వస్తి చెప్పి బడిబాటకు వెల్‌కం చెబుతున్నారు. నేటి నుంచి పిల్లలంతా బుద్ధిగా పుస్తకాల బ్యాగ్‌ను భుజాన వేసుకుని బడిబాట పట్టనున్నారు. బుధవారం నుంచే విద్యాసంస్థలు తెరుచుకోవాల్సి ఉంది. కానీ నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం నేపథ్యంలో పాఠశాలలను ఒక రోజు ఆలస్యంగా 13వ తేదీ నుంచి పునః ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. గురువారం నుంచి జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలుపునః ప్రారంభంకానున్నాయి.

ఏడీఏగా శివశంకర్ బాధ్యతల స్వీకరణ



ఏడీఏగా బాధ్యతలు స్వీకరించిన శివశంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఓలు

మదనపల్లె : వ్యవసాయశాఖ మదనపల్లె డివిజన్ ఏడీఏగా శివశంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏడీఏగా పనిచేస్తున్న దీక్షాకుమారి ఈనెలలో పదవీవిరమణ నేపథ్యంలో మాతృశాఖ సాయిల్ కన్జర్వేషన్‌కు వెళ్లేందుకు రిలీవ్ అయ్యారు. చిత్తూరులో పనిచేస్తున్న శివశంకర్‌ను మదనపల్లెకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఈనేపథ్యంలో బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... మదనపల్లె డివిజన్‌లో 40శాతం రాయితీతో 24,978 మంది రైతులకు 63,680 బస్తాలు(30కిలోలవి) పంపిణీ చేశామన్నారు. జనుము, జీలుగ తదితర పచ్చిరొట్ట ఎరువులు 50శాతం రాయితీతో 969 మంది రైతులకు 711 క్వింటాళ్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. 193 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మదనపల్లె ఏడీఏగా బాధ్యతలు స్వీకరించిన శివశంకర్‌కు డివిజన్‌లోని ఏఓలు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

బీసీజీ టీకా సద్వినియోగం చేసుకోండి



బీసీజీ టీకాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పీలేరు : క్షయవ్యాధిని వ్యాప్తిని సమూలంగా నిర్మూలించేందుకు ఇస్తున్న బీసీజీ టీకాను సద్వినియోగం చేసుకోవాలని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గూడరేవుపల్లెలో బీసీజీ టీకాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఇస్తున్న బీసీజీ టీకా ఇప్పటి వరకు పిల్లలకు మాత్రమే ఇవ్వడం జరిగేదని, అయితే క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా 18 ఏళ్ల పైబడి టీబీ ఇచ్చే అవకాశం ఉందని గుర్తించిన వారికి, 60 సంవత్సరాలు పైబడిన వారికి, మద్యం తాగేవారికి, పొగ తాగేవారికి సూక్ష్మ ప్రణాళిక వారిగా శిక్షణ పొందిన సిబ్బందిచే బీసీజీ టీకా ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు పవన్‌కుమార్, హెచ్ఈ కొండయ్య, శ్రీనివాసులు, ఏఎన్ఎం ఫేమున్నీషా, సీహెచ్‌వో లావణ్య, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



గురివిరెడ్డిగారిపల్లెలో అవగాహన ర్యాలీ

పెద్దమండ్యం: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఫోర్డ్ సంస్థ మండల కో ఆర్డినేటర్ ఆవుల నరసింహులు అన్నారు. మండలంలోని పాపేపల్లె పంచాయతీ గురివిరెడ్డిగారిపల్లెలో బుధవారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై కళాజాత నిర్వహించారు. బెంగళూరు క్రై సంస్థ సహకారంతో ఫోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులుగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురివిరెడ్డిగారిపల్లె పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిల్లలకు డ్రాయింగ్, ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మిదేవి, ఫోర్డ్ సంస్థ సిబ్బంది భువనేశ్వరి, అనిత, రెడ్డెమ్మ, మీనా, రమణ పాల్గొన్నారు.

ఈఏపీసెట్ ఫలితాల్లో క్రిష్ణారెడ్డి సిద్ధార్థ జయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి

మదనపల్లె : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్షలో పట్టణానికి చెందిన శ్రీ కృష్ణారెడ్డి సిద్ధార్థ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేసినట్లు ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం విడుదలైన ఈఏపీసెట్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన జి.మహేంద్ర 3,985 ర్యాంక్, పి.మహేష్ 5,102, గౌతమి 5,627, పి.అల్లాబక్షుఖాన్ 7,532, పి.హర్షవర్ధన్ 7,835, బి.బాలాజీ 9,215, యస్.హిమయశ్రీ 11,299, ఎం.కిశోర్ 12,354, జి.తుషార్ 13,392, కె.లోహిత, 14,207, బి.పుష్పప్రియ 14,966 ర్యాంకులను సాధించారన్నారు. పట్టణంలో ఈఏపీసెట్ ఫలితాల్లో కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాలను మొదటిస్థానంలో నిలిపినందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు సాధించిన విజయానికి గుర్తుగా కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



జ్యోతిప్రజ్వలన చేసి బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న డీజీఎం, పాల్గొన్న బ్యాంకు సిబ్బంది

రాజంపేట టౌన్ : ఖాతాదారులకు మెరుగైన సేవలే పంజాబ్ నేషనల్ బ్యాంక్ లక్ష్యమని ఆ బ్యాంక్ లీడ్ డీజీఎం అభిజిత్ సిన్హా తెలిపారు. పట్టణంలోని దీప్ లాడ్జి సర్కిల్‌లో బుధవారం ఆయన పంజాబ్ నేషనల్ బ్యాంక్ రాజంపేట శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా లీడ్ డీజీఎం మాట్లాడుతూ పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ అన్నారు. తమ బ్యాంక్ బ్యాంక్ పేరును బట్టి ప్రజలు తమది ప్రైవేట్ బ్యాంక్ అనుకునే అవకాశముందని, అయితే తమ బ్యాంక్ పూర్తిస్థాయిలో ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ అని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ దేశంలోనే రెండవ పెద్ద బ్యాంక్ అని తెలిపారు. అన్ని ప్రాంతాల ప్రజలకు తమ బ్యాంక్ సేవలు అందించాలన్న లక్ష్యంతో రాజంపేటలోనూ బ్రాంచ్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బ్రాంచ్ విజయవాడ సర్కిల్‌లో 73వ బ్రాంచ్ అని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఖాతాదారులకు టెక్నాలజీ సహాయంతో విశేష సేవలు అందిస్తున్నామన్నారు. తమ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ రంగాల వారి ఆర్థికాభివృద్ధికి, అలాగే అన్ని రకాల రుణాలను తమ బ్యాంక్ ద్వారా నిబంధనల మేరకు పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సుబ్రమణ్యం, పట్టణ ప్రముఖులైన ఏబీ.రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపి సేవలు ప్రారంభం

- జిల్లా ఆస్పత్రిలో మానసిక రోగులకు చికిత్స
- అడిషనల్ డైరెక్టర్ డాక్టర్.ఎం.ఎస్.రాజు



సర్వజన బోధనాసుపత్రిలో మానసిక రోగికి ఈసీటీ చికిత్స అందిస్తున్న మానసిక వైద్యులు

మదనపల్లె : ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రిలోని మానసిక వైద్యవిభాగంలో ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ(ఈసీటీ) సేవలు ప్రారంభమైనట్లు అడిషనల్ డైరెక్టర్ డాక్టర్.ఎం.ఎస్.రాజు తెలిపారు. బుధవారం స్థానిక సర్వజన బోధనాసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తీవ్రమైన మానసిక జబ్బులతో బాధపడేవారికి, స్కిజోఫ్రినియా, ఆత్మహత్య ఆలోచనలు ఉన్నవారికి ఈసీటీ చికిత్స ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. మానసిక సమస్యలు, ఆందోళన, కుంగుబాటు, దిగులు, ఆత్మనూన్యత తదితర సమస్యలతో బాధపడుతున్న వారు, వారి కుటుంబ సభ్యులు ఆస్పత్రిలోని మానసిక వైద్యనిపుణులను సంప్రదించవచ్చన్నారు. సర్వజనబోధనాసుపత్రిలో మానసిక వైద్య చికిత్సలకు సంబంధించి వైద్యులు డాక్టర్.విష్ణు, డాక్టర్.రాధిక, సైకాలజిస్ట్ అలేఖ్య, ఎస్.ఆర్.జ్యోత్స్నలు అందుబాటులో ఉన్నారని, వీరి సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరిండెంట్ డాక్టర్.పద్మాంజలి, ఆర్ఎంఓ డాక్టర్.ప్రసాదరాజు, మత్తువిభాగాధిపతి డాక్టర్.రమేష్, అసిస్టెంట్ ఆర్ఎంఓ డి.ప్రమీల, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు మంజు, హేమలత, నాగశ్రీ, హెడ్‌నర్స్ జయప్రభ పాల్గొన్నారు.


16న సిద్దవటంలో బండలాగుడు పోటీలు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్ హరిజనవాడలో కొలువైన జగజ్జనని అంకాలమ్మ తిరునాల సందర్భంగా ఈ నెల 16న వృషభ రాజములచే బండలాగుడు పోటీలు జరుగునని ఆలయ కమిటీ వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 16వ తేదీన అంకాలమ్మ అమ్మవారి జల్ది నుంచి ఊరేగింపు కార్యక్రమం, భక్తులు అమ్మవారికి కాయాకర్పూరాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుట, మధ్యాహ్నం 2 గంటలకు వృషభ రాజములచే బండలాగుడు పోటీలు జరుగునన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిని రూ. 70వేలు మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్ రెడ్డి, మేడా మధుసూదన్‌రెడ్డిలు ప్రకటించారు. రెండవ బహుమతి రూ. 50 వేలును మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డిలు అందజేయనున్నారు. మూడవ బహుమతి రూ. 30 వేలును సిద్దవటం జెడ్పీటీసీ సభ్యుడు ఉపాసి శ్రీకాంత్ రెడ్డి ఇవ్వనున్నారు. నాల్గవ బహుమతి రూ. 10వేలును ఎస్‌కేఆర్ నగర్ గ్రామ ప్రజలు అందించనున్నట్టు పేర్కొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత



హోమం చేస్తున్న అర్చకులు

మదనపల్లె సిటీ: స్థానిక వాసవీభవన్‌వీధిలోని శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం 11వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం గణపతిపూజ, స్వస్తివాచనం, నవగ్రహపూజ, కలశ స్థాపన, అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్, ఉపాధ్యక్షులు గిరిధర్, కార్యదర్శి దేవతా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మ తల్లి జాతర

సంబేపల్లె : మండల పరిధిలోని పెద్దబిడికి పంచయతీలో కొలువైన శ్రీ మారెమ్మ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. రాత్రి మొక్కుబడులు ఉన్న భక్తులు చాందినీబండ్లను ఆలయం చుట్టూ తిప్పారు.

ఉద్యోగాల్లో ప్రతిభను కనబరచాలి

- ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా
- వివిధ కంపెనీలకు ఎంపికైన 172 మంది నిరుద్యోగులు
- ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్న అధికారులు



జాబ్ మేళాలో పాల్గొన్న ఐటీఐ విద్యార్థులు, నిరుద్యోగులు



నిరుద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న కంపెనీల ప్రతినిధులు

రాజంపేట టౌన్ : చదువుకున్న వ్యక్తి జీవితంలో స్థిరపడాలంటే ఉద్యోగం అన్నది తప్పనిసరి అని, అందువల్ల తొలిసారిగా వచ్చే ఉద్యోగ అవకాశాలను వదులుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన నిరుద్యోగులనుద్దేశించి మాట్లాడారు. కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించేందుకే అనేక మంది విద్యార్థులు ఐటీఐ కోర్సు చేస్తారని అన్నారు. అందువల్ల ఐటీఐ పూర్తయిన వారు జాబ్‌మేళా ద్వారా ఉద్యోగం వస్తే ఆ అవకాశాన్ని చేజార్చుకోవద్దని సూచించారు. గతంలో ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ఉద్యోగ అవకాశాల కోసం పెద్ద నగరాలకు వెళ్లి ఉద్యోగాన్వేషణ చేసేవారన్నారు. అయితే ఇప్పుడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చిన్నపట్టణాలకు వస్తున్నారని చెప్పారు. నిజంగా ఇది ఇప్పటి నిరుద్యోగులు చేసుకున్న అదృష్టం అని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని, ఉద్యోగం వచ్చిన వారు మరో ఆలోచన చేయకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాదాపు అన్ని కంపెనీలు మెరుగైన వేతనం ఇవ్వడంతోపాటు కంపెనీకి వెళ్లి వచ్చేందుకు ఉచిత రవాణా సౌకర్యం, కంపెనీలో తక్కువ ధరకే భోజనం వంటి సౌకర్యాలను కల్పిస్తున్నాయన్నారు. అందువల్ల వచ్చే వేతనంలో కొంతవరకే ఖర్చవుతుందని, మిగతా డబ్బులను ఇంటి వద్ద ఉండే తల్లిదండ్రులకు వారి అవసరాల నిమిత్తం పంపుకోవడం కాని లేకుంటే పొదుపు చేసుకునేందుకు వీలవుతుందని తెలియజేశారు. ఇటీవలే ఐటీఐ పూర్తి చేసుకున్న వారికి తక్కువ వయస్సు ఉంటుందని, కొన్ని సంవత్సరాలు కష్టపడి ఉద్యోగం చేసి పనిలో ప్రతిభను కనబరిస్తే వేతనం కూడా భారీగా పెరుగుతుందన్నారు. అప్పుడు వివాహం చేసుకొని జీవితంలోనూ స్థిరపడి చక్కటి భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని తెలిపారు. ఇలాంటి విషయాలన్నింటిని పరిగణలోకి తీసుకొని వచ్చిన అవకాశాలను ఎవరు కూడా నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు ఆయా కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీల్లో ఉద్యోగం పొందిన వారికి ఇచ్చే వేతనం, కల్పించే సౌకర్యాలు, నియమ నిబంధనలను వివరించారు. కాగా ఈ జాబ్‌మేళాలో 190 మంది నిరుద్యోగులు పాల్గొనగా 172 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆయా కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలించి అనంతరం రాత పరీక్షతోపాటు మౌఖికంగా ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టాటా స్ట్రైవ్ సీనియర్ ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ మేనేజర్ మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.